'జ్యోతి' చిన్న కథల పోటీలో గెలుపొందిన కథ

అన్నయ్య అనురాగం

"సునీత"

సునీలూ! సింహగర్జనలా వినిపించింది ఆ పిలుపు ఆ పిలుపు నాలుగు గదులు దాటి సునీల గదిలో, కిటికీ దగ్గర కూర్చున్న సునీల చెవులను తాకి, ఆశ్చర్యపరచింది మధురాతి మధురంగా నున్న ఆ గొంతుకలో ఆప్యాయత కురిపించునట్టి తన తండ్రి పిలుపేనా? అది.

సునీలూ! మరో సారి భయంకరంగా హాలు దద్ధరిల్లునట్లుగా వినిపించింది. సునీల గభాలున గుమ్మంలోనికి వెళ్ళింది. అపటికే తన తండ్రి చేతిలో యేదో కాగితం పట్టుకుంటూ కళ్ళలో నిప్పులు కురిపిస్తూ కనిపించేరు.

"ఏం నాన్నగారూ! కంగారుగా అడిగింది సునీల"

ఏమిటిది? ఎన్నాళ్ళనుంచి ఈ పన్నాగం చెప్పు?"

తండ్రి చేతిలోని ఉత్తరం చూసి త్రుళ్ళిపడింది. కాలేజీ నుంచి వచ్చి అశ్రద్ధగా పుస్తకాలు విసిరేసింది. అందులో తనకు రాజేష్ వ్రాసిన వుత్తరం వున్న సంగతి మర్చిపోయింది.

అవును నాన్నా! ఇది నిజమే మీకు తెలియకుండా ఈ పని చేస్తునందుకు క్షమించండి. రాజేష్ చాలా వుత్తముడు నాన్నా నేను మనస్ఫూర్తిగా ప్రేమించాను పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం. మీతో చెబుదామనుకుంటుండగా.... మీరే.,

ఏం? కూశావు రామనాధంగారు చెయ్యి ఆవేశంతో పైకెత్తి ఆ చెంప ఈ చెంప చెళ్ళుమనిపించాడు. కోపంతో ఆవేశంతో వూగిపోతుండగ.

శంకరం హాలులోకి వచ్చి ఏమిటి నాన్న? ఏం? జరిగింది. ఏమైందసలు. అన్నాడు. తండ్రి ఆవేశాన్ని, చెల్లెలు బిక్కమొహాన్ని" చూస్తూ.

ఏం జరిగిందా? ఏం జరిగిందో దాన్నే అడుగు. ఇది నా కడుపున చెడబుట్టిందిరా నా ఈ వంశాన్ని నా ప్రతిష్టను నాశనము చేస్తున్న నీ చెల్లెలు ఘనకార్యం రా యిది. ఎవడో శూద్రపు కులంవాడని నమ్మి బ్రాహ్మణ కులాన్ని గంగపాలు చేస్తుందిరా ఇది నా కూతురు కాదు. ఇది మహా...... అంటూ మళ్ళీ చెయ్యి ఎత్తబోయాడు.

ఏమిటి నాన్న మీరు ఆడపిల్లపై చేయి చేసుకోవటం అంటూ తండ్రీ, కూతుళ్ళ మధ్యగా నిలబడి, చెల్లెల్ని తన వీపు వైపు నెట్టాడు.

ఇది ఆడపిల్ల కాదురా. ఆడ రాక్షసి. ఆవేశంతో ఒగరుస్తూ కళ్ళలో నిప్పులు కురిపిస్తున్నాడు రామనాథం పంతులు.

"నాన్నా మీరు పెద్దవాళ్ళు ఆవేశపడకండి నిదానంగా ఆలోచించే విషయాలు యివి. పెద్దగా అరవడం వలన మనకే నష్టం తర్వాత మాట్లాడుకుందాం కాస్త విశ్రాంతి తీసుకోండి మీరు" అంటూ అక్కడున్న కుర్చీపై బలవంతంగా కూర్చోపెట్టేడు. వంటగదిలోనికి వెళ్ళి చూస్తే తల్లి మతిపోయిన దానిలా చూస్తూ కూర్చుంది.

చెల్లెలు గదిలోకి వెళ్ళి చూడగా సునీల వెక్కి వెక్కి ఏడుస్తూ కూర్చుంది. బుద్ధి తెలిసిన తరువాత ఏ నాడు తండ్రి చేతిలో దెబ్బలు తినని తన చెల్లెలు అతి గారాబంగా పెరిగిన సునీల బుగ్గలు అచ్చు తేరేలా వున్న దెబ్బలను చూసిన వెంటనే అతని కళ్ళలో నీళ్ళు తిరిగేయి. అవి కనిపించకుండా తుడుచుకొని, దగ్గరకు వెళ్ళి "సునీ" అని పిల్చేడు నెమ్మదిగా. వెక్కి వెక్కి ఏడుస్తున్న సునీల వెనకితిరిగి చూపి అతని కళ్ళలో పొంగి వస్తున్న కన్నీటిని చూస్తూ అన్నయ్యా, నా కోసం ఏడుస్తున్నావా? నిజము? అన్నయ్యా అంటూ మళ్ళీ అతని గుండెలో తల దాచుకొంటూ ఏడుస్తూ కూర్చుంది.

"సునీ ఏమిటిది? నువ్వలా ఏడుస్తూ కూర్చుంటే ఎలా? నీ బాధ ఏమిటో ఎలా తెలుస్తుంది. నువ్వు చెప్పకపోతే ఎలా తెలుస్తుంది చెప్పులే. నిదానంగా కూర్చుని జరిగిందేమిటో చెప్పు."

"అవునన్నయా నేను రాజేష్‌ని ప్రేమిస్తున్నాను. మనస్ఫూర్తిగా ప్రేమించి ఆరాధిస్తున్నాను. రాజేష్ చాలా వుత్తముడన్నయ్యా అతని ప్రేమ, అనురాగం, ఆప్యాయత పొందిన నేను జన్మ జన్మలకు ఋణపడివుంటాను. నేను తెలివి తక్కువగా, యవ్వన అహంకారం, తొందరపాటులో ప్రవర్తించ లేదన్నయ్యా నాకున్న ఆత్మవిశ్వాసంతోటి, ఆత్మ స్థయిర్యంతోటి నేను ధైర్యంగా ఎదుర్కోగలను. ప్రేమ చాలా పవిత్రమైందన్నయ్యా ప్రేమించి ప్రేమించబడటం ఒక నేరమా! నేను చేస్తున్న పని తప్పా? చెప్పన్నయా?"

'తప్పు కాదమ్మా ఇది నవలలు సినిమాలు కాదమ్మా! జీవితం! దేముడిచ్చిన వరం. మన దారికి అడ్డువచ్చిన ముళ్ళన్నీ ఎదుర్కొని పూలబాటగా తీర్చిదిద్దుకోవాలి. తొందరపాటు అనాలోచన పనికిరాదు. నీ భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని వివేకంతో ఆలోచించి ఒక నిశ్చయానికి రా," అంటూ ముందుకు వెళ్ళబోయాడు శంకరం.

"అన్నయ్యా,! రాజేష్‌తో నా జీవితం ఏనాడో ముడిపడిపోయింది అతను లేకుండా బ్రతకడం కష్టం. నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చానన్నయ్యా!"

అయితే సరే! వస్తానంటూ ముందుకు వెళ్ళాడు శంకరం.

* * *

సునీల అతి మామూలుగా తయారయి సంధ్యవేళ లోపల దీపం వెలిగించి, ఎదురుగా వున్న చిన్ని కృష్ణునకు నమస్కరిస్తూ 'దీపం, జ్యోతి, పరబ్రహ్మం, దీపం సర్వం సంధ్యాదీపం నమస్తుతే' అని రెండు చేతులూ జోడించి మనస్సులో ధ్యానించింది. చిన్ని కృష్ణుడు చిరునవ్వుతో చూస్తూ వుంటే తనూ చిరునవ్వు నవ్వింది.

మెల్లగా అడుగులేసుకుంటూ గేటు తెరచుకొని పరిసరాలను చుట్టూ మనసారా చూచుకొని ధైర్యంగా ముందుకు అడుగులేసింది. మనసులో ఆలోచనలు ఈగల్లా ముసురుకున్నాయి ....

అద్దంలో చూసి తల దువ్వుకుంటున్న రాజేష్ వెనకనుండి చిరునవ్వుతో స్వచ్ఛమైన తెల్లని పుష్పంవలె విచ్చుకున్న ఆ ముగ్ధ మనోహరిని చూసి ఆశ్చర్యబోయాడు. వెనక్కి తిరుగుతూ 'అరె! సునీ! నీవా? ఎప్పుడూ నా రూంకు రాని దానివి ఈ వేళలో ఏమిటిలా దయచేశావ్?' ఆశ్చర్యంతో కనుబొమలు దగ్గర చేస్తూ అడిగాడు.

'రాజూ! నీ రూమ్‌కే కాదు, నీ జీవితంలోనికే పూర్తిగా వచ్చేశాను.' అంటూ చిరునవ్వుతో అతని ప్రక్కన కూర్చుంది, అర్థం కానట్లు చూశాడు రాజేష్. జరిగింది అంతా చెప్పి, అన్ని బంధాలు, అన్ని మమకారాలు, అనురాగాలు త్రెంచుకొని ధైర్యంగా నీ దగ్గరకి వచ్చేసాను రాజూ!' అంటూన్నప్పుడు ఆమె పెదివులు కంపించాయ్. ఆఖరు మాటలు అంటున్నప్పుడు నొక్కి-నొక్కి ఏడుస్తూ అతన్ని అల్లుకుపోయింది.

'సునీ! మంచి పని చేశావ్, మళ్ళీ ఈ ఏడుపెందుకు? అంత ధైర్యసాహసములతో చేసినదానివి మళ్ళీ ఈ బేలతనం ఎందుకు? ఛి....ఛి....వూరుకో' అంటూ ధారగా కారుతున్న కన్నీటిని తుడిచి ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు.

రెండురోజులనంతరం నిజ జీవితంలో భార్యాభర్త లయ్యారు కుమారి సునీత శ్రీమతి సునీతగా మారిపోయింది. వెళ్ళిపోయే రోజున శంకరంను స్టేషన్‌కు రమ్మనమని ఫోన్ చేసింది. స్టేషన్‌లో అన్నయ్యకోసం ఎదురుచూస్తుండగా వచ్చాడు శంకరం. రాజేష్ దగ్గరగా వెళ్ళి అతని చేతులను తన చేతిలోకి తీసుకొని 'రాజూ! సునీత చిన్న వయసుది. తెలిసీ తెలియని వయస్సు. అది తెలియక చేసిన తప్పయినా, తెలిసి చేసిన తప్పయినా కోపగించినప్పుడు సరిదిద్దాల్సిన బాధ్యత నీది. ఇంతకంటే నీకు నేను చెప్పాల్సింది లేదు' అంటూ ఆప్యాయంగా భుజం నొక్కాడు. చెల్లెలు మొహంలో గమనిం

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడెన్‌సాత్
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
DOL-327/1 1

చిన భయాందోళనలు గమనించిన శంకరం 'సుశీ! ఈసారి నేను వచ్చేటప్పుడు మేనల్లుడుండాలియేం?' అన్నాడునవ్వుతూ.

సుశీల వెంటనే రాజేష్ ముఖంలోకి చూపి అంతలోనే చిరునవ్వుతో తలవాల్చేసింది. దూరంగా వినిపిస్తున్న రైలుకూత విని శంకరం 'వస్తాను. పని వుంది' అని గబగబా స్టేషన్‌దాటి వెళ్ళిపోయాడు.

* * *

కాలచక్రం గిర్రున తిరిగిపోతుంది. రెండేళ్ళ తరవాత శంకరం సంసారం చేస్తున్న సమయంలో తల్లి కొడుకు దగ్గర కూర్చొని 'శంకరం! సుశీల బాగుందటరా! సుఖంగా వుందా అసలు? సుశీలకేం తెలియదురా పాపం. వుత్త అమాయకురాలు నా తల్లి ఎలా వుందో? ఎక్కడున్నా దేవుని దయవలన సుఖంగావుంటే చాలు.'

'అమ్మా! నీ కూతురు నువ్వనుకున్నంత అమాయకురాలు కాదమ్మా! అది చాల తెలివైనది. అది ఏ పని చేసినా సంపూర్ణ విశ్వాసంతో చేస్తుందమ్మా! బావని ఎంత ఆడిపించి ఏడిపిస్తుందో. నువ్వనవసరంగా బాధపడకమ్మా! సుశీల ఎక్కడున్నా సుఖంగా సంతోసంగా వుంటుందమ్మా!' అంటూ తల్లికి ధైర్యవచనాలు చెప్పి అక్కడకుండి లేచి వెళ్ళిపోయాడు.

కాలం మాన్పని గాయం లేదంటారు. మెల్లమెల్లగా రామనాథంగారికి కుతురిపట్ల ఏర్పడిన కోపం, పట్టుదల బదులుగా జాలి సానుభూతి రోజురోజుకీ పెరిగిపోయాయి.

శంకరం ఆఫీసులో ఫైళ్ళలో తల దూర్చి సీరియస్‌గా ఆలోచిస్తుండగా పోస్ట్ అన్న కేక విని లేచివెళ్ళి వుత్తరం అందుకున్నాడు. ఎవరబ్బా అని కవరు త్రిప్పి చూశాడు. సుశీల దగ్గరనుండి. వెంటనే విప్పి చదవాడు——

ప్రియమైన అన్నయ్యకు!

సుశీల నమస్కరించి వ్రాయునది. అన్నయ్యా! నా మీద నీకు చాలా కోపం

వచ్చిందిగదూ నేను ఇంతవరకు ఉత్తరం వ్రాయలేదని? ఏం చేయను నన్నయ్యా !పరిస్థితుల ప్రభావంవలన ఇలా జరిగింది. క్షమిస్తావుకదూ!

అన్నయ్యా! ఇక్కడనుండి ధైర్యంగానే వెళ్ళాము. అత్తగారూ, ఆడపడుచులు ఆప్యాయంగా ఆదరిస్తారని నమ్మిన నేను వాళ్ళ ప్రవర్తనకు చాలా ఆశ్చర్యపోయాను. కొన్నికొన్ని సంఘటనలు వివరంగా రాస్తాను. చదువు— మొట్టమొదట వాళ్ళ ఆచారాలు సంస్కృతీ, వాళ్ళ పద్ధతులు అలవాటు చేసుకోవడం కష్టమనిపించింది. రానురాను అలవాటైంది, అత్తగారికి నన్ను ఒక వింత మనిషి చూస్తున్నట్టు చూస్తుంటే బాధ పడ్డాను. ఆడపడుచులు చేస్తున్న హేళనలకు తట్టుకోలేక బలవంతంగా వస్తున్న దుఃఖాన్ని తమాయించుకున్నాను. ఈ లోకం, ఈ సంఘం సూటిపోటి మాటలకు, వాళ్లు చూపే దయ, సానుభూతికి మనస్సులో సూదుల్లా గుచ్చుకునేవి. వాళ్ళ మాటలు.

ఒకసారి ఆయన స్నేహితునితో మాట్లాడుతూంటే -

'ఏం చేస్తాం పిన్నీ! ఆడపిల్ల అలా బరితెగించి మగాళ్ళతో సరసాలాడుతూ మాట్లాడటం ఎరుగుదుమా! ఎంత చదువుకున్న అమ్మాయి అయితేమాత్రం మా అమ్మాయిలు లేరూ! వాళ్ళ వినయ విధేయతలు, అణకువ దీని కెక్కడనుండి వస్తుంది? అయినా మన కులంలో వున్న రీతి, సాంప్రదాయం దీని కెలా వస్తుంది? వృత్త పిచ్చి సన్యాసి కాబట్టి దీని వలలో పడి మా ఆశలు గంగపాలు చేశాడు. ఇదంతా మా ఖర్మ ఏం చేస్తాం పిన్నీ?'

వంటింట్లోంచి వినవస్తున్న ఈ మాటలు విని గుండెల్లో పొంగికొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయాను. గదిలోనికి వెళ్ళి వెక్కి ఏడవసాగాను. ఇంతలో ఆయన దగ్గరగా వచ్చి 'సునీ! ఏమిటది? దీనికే ఇలా బెంబేలు పడిపోతే ఇకముందు ఎలా నెగ్గుకొస్తావు? నువ్వు నాతో వస్తున్నప్పుడు ఏమన్నావు. ఒక్కసారి ఆలోచించు.'

'మీరు నా ప్రక్కన వుంటే ఎంత సాహసాన్నైనా చేయగలను. ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదుర్కోగలను. మీరు నా అండగా నిలిచివుంటే ఎంతటి కష్టాలైనా అవలీలగా భరిస్తాను' అని మాట యివ్వలేదూ అని నన్ను ఓదార్చి ముందున్న కర్తవ్యాన్ని బోధించారు.

ఇంకొకసారి, మా చిన్న ఆడబడుచు తన స్నేహితులకు నన్ను పరిచయం చేసింది. ఇంచుమించు నా వయస్సే వున్న వారిని చూచి చాలా ఆనందపడ్డాను, సరదాగా ఇట్టే వారితో కలిసిపోవాలనిపించింది. దూరంగా వున్న వారి సంభాషణలు విని అవాక్కయిపోయాను.

'సరోజా! మీ అన్నయ్యది లవ్ మేరేజా?'

'ఆఁ....ఈ అమ్మాయిగారి అందంలో పడి మా అన్నయ్య బుద్ధి గడ్డి తిన్నది.'

'అయితే, మీ కులం కాదా?'

'ఛ....ఛ....మా కులం కాదు. అసలు ఆ అమ్మాయి తల్లిదండ్రులకు కూడా తెలియదు. తనే ధైర్యంచేసి అన్నయ్యతో వచ్చేసింది.'

'అంటే....పారిపోయా!'

'కాకపోతే....ఈ ఫ్రబుద్ధుడు సన్మానించి వూరేగిస్తారా ఏం! బిడ్డ మొహమా' అంటూ పకపక నవ్వుతూ స్నేహితులతో వెళ్ళిపోయింది. నాతో ఆప్యాయత కురిపిస్తూ మాట్లాడుతున్న సరోజ నా వెనుకగా ఇలా మాట్లాడిందంటే నమ్మలేకపోయాను.

మరొకసారి వంటింట్లోకి వచ్చిన నేను అక్కడ మసాలా వాసనలకు కడుపు త్రిప్పుతున్నా నిగ్రహించుకుంటూ బలవంతంగా అత్తయ్య దగ్గరకు వెళ్ళి, 'అత్తయ్యా! ఈ వంటలు ఎలా వండాలో కాస్త నేర్పించండి. నేర్చుకుంటా నన్నాను అత్తగారు బుగ్గన వేలేసుకుంటూ 'అయ్యో రామ.... ఈ గర మసాలావాసనలకు కడుపు త్రిప్పి వాంతులు చేసుకునే మీరు ఈ వంటలు వండగలరటే!' సాగదీస్తూ అంది.

'పరవాలేదత్తయ్యా: అలవాటు చేసుకుంటే అదే అలవాటవుతుంది. కొత్తలో కష్టమైనా రానురాను అలవాటవుతుంది' అన్నాను నెమ్మదిగా తలదించుకుంటూ.

ఒకసారి ఆయనగదిలో సామ్రాజ్యాలు కోల్పోయిన మహారాణిలా విచారంగా పరధ్యానంతో ఆలోచిస్తున్న నేను అత్తగారి కేకతో వులిక్కిపడ్డాను 'సునీ! పద భోంచేద్దాం. అమ్మ పిలుస్తుంది. రోజు రోజుకి ఇలా డల్‌గా తయారవుతున్నావేం?' అంటూ బలవంతంగా భోజనాల గది దగ్గరకు నడిపించుకు వెళ్ళారు.

ఆయన ప్రక్కన కూర్చుని భోజనం చేస్తున్న నేను ఆ కూరను, ఆ వంటలకు అలవాటుపడని నేను బలవంతంగా తినడం, అది సాధ్యం కాకపోవడం చూసి వారు ఫక్కున నవ్వారు. అర్థంకానట్లు చూశాను వారివైపు.

'సునీ! అసహ్యం వేస్తుందికదూ? అందుకే కష్టం. హోటల్‌లో ఏదైనా తెచ్చిపెడతానుండు' అన్నారు లేవబోతూ. వారిని కూర్చోబెట్టి ఏం వద్దులెండి. మొదట్లో అసహ్యం వేసినా మెల్లగా అలవాటు చేసుకుంటాను.' అన్నాను బలవంతంగా. అప్పటికే నా కళ్ళలో నీరు తిరుగుతుంది. వారికి కనబడకుండా విశ్వప్రయత్నం చేసాను.

'సునీ! ఎందుకు నీకీ కష్టం. నా నుండి ఎందుకీ పాట్లు?'

'మీ కోసం' అన్నాను కన్నీళ్ళ నిండిన కళ్ళలో, చిరునవ్వు చిందిస్తూ.

నా నవ్వు, ఏడుపు చూసి పకపక నవ్వారు.

అన్నయ్యా! వారు ప్రక్కన వుంటే, ఎంత కష్టానైనా యిట్టే మరిచిపోతాను. వారు నాకు అన్ని విధాలా తగినవారు. నాకు తెలియని వారి ఆచారవిధానా లెన్నో తెలుపుతూ ప్రతి విషయాన్ని బోధపరుస్తు, నా అంతగా నిలచి నన్ను నవ్విస్తూ,



నవ్వుతూ వున్న ఆయన స్వభావాన్ని చూసి గర్వపడని రోజులేదు.

అన్నయ్యా! ఈ జీవితంలో అడుగడుగునా ముళ్ళు అడ్డుపడుతున్నా, ముళ్ళను ఏరుకుంటూ ఈ జీవితాన్ని, నా ఆత్మవిశ్వాసంతోను, ఆత్మస్థైర్యంతోను ఆయన సాహచర్యంలోను పూలబాటగా తీర్చిదిద్దుకుంటాను. ఇది నిజం అన్నయ్యా! ముమ్మాటికి ఇది నిజం. ప్రేమ పవిత్రమైనది. దానిని నేను నమ్ముతాను. ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నాయి. ఆ ఁగారు, పడుచులు నన్ను నన్నుగా గౌరవించి ఆదరిస్తున్నారు. ఎలాగైనా అత్తగారిని నన్ను మెచ్చుకునే విధంగా చేస్తాను. ఈపాటికి అమ్మ, నాన్న కూడా కోపం తగ్గిందనుకొంటాను. నేను ఎక్కడున్నా సంతోషంగా వున్నానని చెప్పన్నయ్యా! త్వరలోనే నీకు మేనల్లుడుని అందివ్వబోతున్నాను. ఈ శుభవార్త వదినకు చెప్పు. తప్పులుంటే క్షమించు. నేను ఎప్పుడూ సంతోషంగా ఉండాలని ఆశీర్వదించు అన్నయ్యా! ఇంక వుంటాను.

జన్మజన్మలకు నీ చెల్లెలుగా పుట్టాలని
భగవంతుని ప్రార్థిస్తున్న
నీ చెల్లెలు
సునీల.'

శంకరం ఆనందంతో ఉత్తరం మడిచి జేబులో పెట్టుకొని, సెలవుచీటి పడేసి పరుగులాంటి నడతో యింటికి వచ్చాడు. గుమ్మంలో బుజ్జిగాడిని చూసి, వుత్సాహంతో వాడిని పైకి ఎగరేసి వాడు కేరింతాలు కొడుతూవుంటే శంకరం ఆనందంతో నవ్వుతున్నాడు.

'ఏమండీ! వాడినలా ఎగరేయకండీ! మంచిదికాదు' అంది శంకరం సంతోషం అర్థంగాక.

అయినా లక్ష్యపెట్టక మరీ మరీ పైకి ఎగరేస్తూంటే బుజ్జిగాడికి ఏం అర్థంగాక పోయినా బోసినోటితో చిరునవ్వులు మాత్రం వెలిగిస్తున్నాడు.